తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
8-7-2023 శనివారం

## రాష్ట్రంలో మత్స్యరంగ అభివృద్ధికి

# విస్తృత అవకాశాలు

**సముద్ర సమాచార, సలహాసేవలపై అవగాహన కార్యక్రమం ప్రారంభించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**

**త్వరలో మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి: మంత్రి జోగి రమేశ్**



శుక్రవారం మచిలీపట్నంలో జరిగిన సముద్రసమాచారం, సేవలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిరన్ రిజిజు, రాష్ట్రమంత్రి జోగి రమేష్, ఎంపి వల్లభనేని బాలశౌరి

**మచిలీపట్నం, జులై7, ప్రభాతవార్త:** ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సముద్ర సమాచార వ్యవస్థల భారత జాతీయ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రెవిన్యూ కళ్యాణ మండపం నందు సముద్ర సమాచారం మరియు సలహా సేవలపై భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్, తదితరుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన గావించి, అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ సముద్ర సమాచార వ్యవస్థల భారత జాతీయ కేంద్రం, హైదరాబాద్ వారు మత్స్యకారులకు, చేపల వేట యజమానులకు నిరంతరం సముద్రం యొక్క స్థితిగతులను అందచేస్తున్నారని, సునామీ వంటి ప్రకృతి విపత్తుల విషయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నారని తెలియచేశారు. సముద్రంలో చేపలు సమృద్ధిగా దొరుకు ప్రాంతాల గురించి మరియు ప్రమాదకరమైన ప్రాంతాలను ≫11

విస్తృత అవకాశాలు

≫ సైతం గుర్తించి వారికి తెలియచేయడం జరుగుతుందని, ఇండి యన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్ వారు ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని సమగ్రంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సముద్ర సంబంధిత సమాచారాన్ని మత్స్యకారులకు అవగాహన కల్పించేందుకు భారత ప్రభుత్వం భారతదేశ తూర్పు, పశ్చిమ తీరాలలో 5 వర్క్ షాపుల చేపట్టాలని తలపెట్టగా.. అందులో భాగంగానే తొలుత ఆంధ్రప్రదేశ్‌లోని మచి లీపట్నం నందు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని వివరించారు. భారతదేశానికి అపార సముద్ర తీరం ఉండటం మత్స్యరంగ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని, భార తదేశ జి.డి.పిలో మత్స్య రంగానిదే అగ్రస్థానమని, సముద్ర తీరం అధికంగా గల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మత్స్యరంగ అభివృద్ధికి అపార అవకాశాలున్నాయని, 2047నాటికి భారతదేశ అభివృద్ధికి భారత ప్రధాని నరేంద్రమోడీ దిశా నిర్దేశం చేశారని తెలిపారు.

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లినప్పుడు వారు తిరిగి వచ్చే దాకా వారి కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యేవారని, అటువంటి సమస్య లేకుండా సముద్ర సమాచార వ్యవస్థ వారు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మత్స్యకారులకు అవసరమైన సమాచారాన్ని అందచేస్తున్నారని పేర్కొన్నారు. చేపల వేట నిషేద సమయంలో మత్స్యకారులకు గతంలో రూ.4 వేలు ఇచ్చేవారని, ప్రస్తుత ప్రభుత్వం రూ.10 వేలు అందచేస్తున్నారని, చేపల వేట మీద ఆధారపడి బతికే మత్స్యకారుల జీవితాలను బలోపేతం చేసేందుకు అవసరమైన ఆధునిక సౌకర్యాలు కల్పిస్తూ.. త్వరలోనే మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మా ణం గావించబడుతుందని, అదే విధంగా పోర్టు నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని తెలియచేశారు.

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ప్రసంగిస్తూ చేపల వేట ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినదని, ఆధునిక పరిజ్ఞానంతో సముద్రంలో మత్స్య సంపద ఉన్న ప్రదేశాలను గుర్తించి, దానిని మత్స్యకారులకు తెలియచేయడం ద్వారా వారికి సమయం, ఇంధనం కూడా ఆదా అవుతుందని స్పష్టం చేశారు. బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ గురించి మత్స్యకారులకు తెలియచేయాలనే ఉద్దేశ్యంతోనే ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేయడం జరిగిందని, పార్లమెంట్ సభ్యుని నిధులు మరియు సి.ఎస్.ఆర్ ఫండ్స్‌తో ఆధునిక సాంకేతిక వ్యవస్థ కలిగిన సరికొత్త బోటును ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు, అందుకు మత్స్యకార యువతను గుర్తించాలని, మత్స్యకారులకు అవసరమైన డ్రై ఫిష్ ప్లాట్‌ఫామ్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. జి.ఎన్.హరిహరన్, ఇమ్‌కాయిస్ డైరెక్టర్ డా. టి.శ్రీనివాసరావు, భూ విజ్ఞాన శాస్త్రం మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ సెంథిల్ పాండియన్‌లు మత్స్యకారులకు అందించే సేవల గురించి వివరించారు. కొచ్చిన్ షిప్‌యార్డ్ వారు డీప్ సీ ఫిషింగ్ గురించి ప్రజంటేషన్ ఇవ్వగా.. అనంతరం కేంద్రమంత్రి మత్స్యకారులకు జెమిని డివైస్‌లు అందచేశారు. ఈ కార్యక్రమంలో కృత్తివెన్ను జడ్‌పిటిసి రత్నకుమారి, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు చింత గోవిందరాజులు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, పెద్ద సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు.